


# ఇమిటేషన్ ఇష్టంలేదు

— వసుంధర

“ఏమండీ!” అంది శ్రీమతి గోముగా.

“ఊఁ” అన్నాను.

“మీరేమీ అనుకోనంటే ఒక చిన్న కోరిక” అంది శ్రీమతి మళ్ళీ.

“నీ కోరికకు నేను ఎప్పుడైనా యేమైనా అనుకున్నానా?” అంటూ యెదురు ప్రశ్న వేశాను.

“కానీ యిది వేరండీ” అంది శ్రీమతి.

“ఫరవాలేదు చెప్పు” అన్నాను మనసులో భయపడుతూనే.

“మిమ్మల్ని నేను యిక్కణ్ణించి నువ్వు అని వ్యవహరిస్తాను. ముద్దుగా రంగా అని పిలుస్తూంటాను” అంది శ్రీమతి.

ఉలిక్కిపడ్డాను. మాకు పెళ్ళయి ఆరేళ్ళయింది. ఆరేళ్ళుగా లేని కోరిక ఈ రోజు శ్రీమతికి యెలా పుట్టింది? యెందుకు పుట్టింది?

నిజంగానే శ్రీమతి కోరిక నాకు యిబ్బంది కలిగించేదే? మొగుణ్ణి నువ్వు అని పిలిచే ఆడవాళ్ళని మా యింట్లో వేళాకోళం చేస్తారు. ఆ మగాడు చేతకానివాడనీ, బొత్తిగా పెళ్ళాన్ని అదుపులో ఉంచలేనివాడనీ, పెళ్ళాం గౌరవాన్ని పొందనివాడనీ రకరకాలుగా అంటూంటారు. అటువంటి దంపతుల మీద మా యింట్లో జోకులు పడుతూంటే నేనూ విని ఆనందించే వాణ్ణి. హఠాత్తుగా యిప్పుడు మేమూ అటువంటి లిస్టులోకి చేరిపోవాలా?

అలా అని శ్రీమతి కోరిక కాదనలేను. అటు స్నేహితులకు, యిటు తలిదండ్రులకు తోడబుట్టినవాళ్ళకు లేని చనువు మా యిద్దరి మధ్యనూ వున్నది. మా యిరువురికీ రహస్యాలన్నవే లేవు. అలాంటప్పుడు ఒకరినొకరు నువ్వు అని పిలుచుకోవడంలో తప్పేమున్నది? భార్యాభర్తల్లో ఒకరు గొప్ప, ఒకరు తక్కువ అనే ప్రసక్తి యేమున్నది? శ్రీమతి కోరికను మన్నించకపోతే నా యిరుకు మనస్తత్వాన్ని ప్రదర్శించినవాడినౌతాను. అసలు దీని గురించి ఆలోచించడమే తప్పు!

అయితే నే నొక వాతావరణంలో పుట్టాను. ఆ వాతావరణం ప్రకారం భార్యకూ, ఏమండీ అన్న పిలుపుకూ అవినాభావ సంబంధమున్నది. నువ్వు అని పిలిస్తే యేదో అపశృతి పలికినట్లుంటుంది నాకు. ఏమండీ అనడం ద్వారా భార్య భర్తను మన్నిస్తున్నదని నాకు తోచదు. అది ఒక మధురమైన పిలుపు. ఆ పిలుపు భార్యా భర్తల మధ్యదూరం పెంచుతుందనేందుకు వీలులేదు. కోపం వచ్చినప్పుడు శ్రీమతి నాకు యేమాత్రం భయపడదు. మీరు అని మన్నిస్తూనే నానా తిట్లూ తిడుతుంది. నువ్వు అని అంటూనే నేను ఆమెకు భయపడతాను. అలవాటుగా వున్న యీ సంబోధనలకూ సంసార జీవితానికీ యేమీ సంబంధం లేదు.

భార్య భర్తను నువ్వు అనవచ్చు. ఏరా అనవచ్చు. కానీ యీ సమాజంలో జీవితం నిజంగా ఒక నాటకం. ఎన్నో సందర్భాల్లో మనం నటిస్తూంటాం.

భర్తవద్ద భార్యకుండే చనువు గురించి అందరికీ తెలుసు. కానీ ఇంట్లో మూడోమనిషి వున్నప్పుడు భార్య భర్త యెదుట బట్టలు మార్చుకోదు. “కాస్త అవతలకి వెళ్ళండీ, బట్టలు మార్చుకోవాలి” అంటుంది. భర్త మౌనంగా బయటకు వచ్చేస్తాడు. ఇది నాటకం

కాదని యెవరనగలరు?

ఈ నాటకానికి యేర్పడిన అనేక సంప్రదాయాల్లో "ఏమండీ" ఒకటి. ఏకాంతంలో భార్యాభర్తలు యెల్లకాలమూ ఒకరి నొకరు మన్నించుకోవడం జరుగుతుందని కనీసం నా అనుభవాన్నిబట్టి అనుకోను. కానీ బయట నలుగురి మధ్యా వున్నప్పుడు యీ సంప్రదాయం పాటించబడాలని నా కుంటుంది. నా భార్యను నేను "ఏమే" అని పిలవను. అలా పిలిచినా, శ్రీమతి గురించి యెవరికైనా అది అని చెప్పినా యేదో అపశ్రుతి పలుకుతుంది నాలో. కానీ అదీ ఒక విధమైన సంప్రదాయమే! ఒక సంప్రదాయాన్ని పాటించి మరో సంప్రదాయాన్ని వదలిపెట్టాలనుకునే వాడు సంప్రదాయాలను గౌరవించడం ప్రసక్తి యెక్కడున్నదని చాలామంది అనుకోవచ్చు. కానీ నా తర్కం నా కుండనే వున్నది.

ఇంట్లో చిన్నపిల్లలు తలిదండ్రుల దగ్గర్నుంచే తమ ప్రవర్తను తీర్చిదిద్దుకుంటారు. తల్లీ తండ్రీ ఒకరినొకరు నువ్వు అని పిల్చుకుంటే - వాళ్ళకు ఏమండీ అని మన్నించే పదం గురించి తెలియకుండా పోతుంది. బయటివాళ్ళను కూడా చటుక్కున నువ్వు అనేస్తూంటారు. వాళ్ళకు యీ తేడా తెలియడం కోసం యీ రెండు రకాల సంబోధనలూ చిన్నప్పట్నించీ నిత్యవ్యవహారంలో చూడాలి. సాధారణంగా పిల్లలకు తల్లివద్ద యెక్కువ చనువు. తలిదండ్రులలో తల్లి చిన్నది! అందువల్ల కుటుంబంలో మన్ననకు పాత్రుడయ్యే వ్యక్తి తండ్రి కావాలి!

నా ఆలోచనల్లో లోపా లుండవచ్చు. నా ఆలోచన లీ విధంగా నడవడానికి కారణం నేను మగవాణ్ణి కావడమే కావచ్చు. కానీ నాకు అలా యిష్టం. అలాగని శ్రీమతిని నేను శాసించ లేదు. నాలోని సంస్కారం అందుకు అంగీకరించదు.

"నువ్వు రంగా అని పిలిస్తే నాకు యేమాత్రమూ అభ్యంతరం లేదు. మధురమైన నీ పెదవులు ఆ అక్షరాల నుచ్ఛరించడానికి కంపిస్తూంటే నాకు పెళ్ళిరోజులు గుర్తుకు వస్తాయి."

"ఈ మాటలు మీరు మనస్ఫూర్తిగానే అంటున్నారా?" అంది శ్రీమతి. ఆమె కా అనుమానం రావడాని క్కారణం నాకు తెలుసును. నా మాటలు వింటున్నప్పుడు ఆమె నా ముఖం వంకే చూస్తున్నది.

"ఇంట్లో మిగతావాళ్ళు యేమనుకుంటారో నని నాకు భయంగా వున్నది తప్పితే - ఏ పిలుపు యెలా వున్నా నాకు యిష్టమే!" అన్నాను. అది అబద్ధమే కావచ్చు. కానీ యింకోలా అనడానికి నేనేం కారణం చెప్ప గలను?

"ప్రస్తుతం యింట్లో యింకెవ్వరూ లేరు కదా - అందుకే యిప్పట్నించే మొదలుపెడతాను. ఓ వారంరోజుల్లో వాళ్ళు వచ్చేసరికి మనకు బాగా అలవాటైపోతుంది. నీకూ ఏమనిపిస్తుందో చెప్పొచ్చు. ఏమంటావ్?" అందామె.

మంచం మీద యిబ్బందిగా కదిలాను. అప్పుడే శ్రీమతి తన కోరికను ఆచరణలో పెడుతోంది. నాకు యేమాత్రమూ సంతోషంగా లేదు. నాలో అహం బాగా వుందని అప్పుడే అనిపించింది. లేకపోతే నా కోసం తనవారందర్నీ వదులుకుని వచ్చి తన సర్వస్వాన్నీ నాకు అర్పించుకున్న శ్రీమతి నన్ను మన్నించాలని అనుకోవడమేమిటి?

"అసలు నీకీ కోరిక యెలా పుట్టింది?" అన్నాను నీరసంగా.

మా యింటి కెదురుగా కొత్త దంపతులు దిగారు. యువకుడు రామనాథం. యువతి సరళ. ఆమె అతన్ని రామూ అని పిలుస్తుంది. అత డామెను సరూ అని పిలుస్తాడు.

ఆ జంట చూడ ముచ్చటగా వుంటుంది. ఆ పిలుపు మాత్రం కాస్త ఎబ్బెట్టుగానే వుంటుంది. నా శ్రీమతి సరళ నా విషయం అడగ్గా "భర్తను యేకవచన ప్రయోగం చెయలేని ఆడది అతడికి ప్రియురాలు అనిపించుకోదు. బానిస అనిపించుకుంటుంది" - అని ఆమె జవాబిచ్చిందట. శ్రీమతి సంప్రదాయాల ప్రసక్తి తీసుకురాగా "సృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ సమానులే. ఏమండీ అన్న పిలుపు పోయేవరకూ ఆడది ఆ విషయం ఒప్పుకున్నట్లు కాదు" అని జవాబిచ్చిందట. అప్పట్నించీ శ్రీమతిలో, తనూ అలా వుండాలన్న కోరిక విత్తులా పుట్టి నేటికి మహావృక్షమయింది.



మర్నాటినుంచీ శ్రీమతి తన కోరికను ఆచరణలో పెట్టడానికి చాలా తీవ్రప్రయత్నాలు ప్రారంభించింది. ఆరేళ్ళ అలవాటు అంత సులభంగా పోదు కాబట్టి ఆమె చాలా పొరపాట్లు చేస్తూండేది. "ఏమండీ, నువ్వు వెళ్ళి స్నానంచేసి రండి", "రంగా! సబ్బెక్కడ పెట్టారు?", "మీరు భోజనానికి వస్తావా?" - యిలాంటి వాక్యాలు మొదటి రోజు చాలా

దొర్లాయి. కానీ రెండో రోజుకు అవి చాలా వరకూ తగ్గాయి. ఆమె ఏకవచన ప్రయోగంచేసినపుడల్లా నా ముఖం అదోలా అయిపోతూండేది. బహుశా చిన్నబుచ్చుకునేవాడి ననుకుంటాను.

శ్రీమతి యిది గమనించినట్లుంది. "నే నిలా పిలవడం మీకు నచ్చుతున్నట్లు లేదు. ఇష్టం లేకపోతే మానేస్తాను. మీరు బాధపడితే నాకు బాగుండదు" అంది.

శ్రీమతికి నేను వజ్రాల హారాలు కొనలేదు. కొనమని ఆమె అడగనూ లేదు. యీ చిన్న కోరిక తీర్చలేకపోతే నా సంస్కారానికే అవమానం. అందుకే నా కేమీ బాధ లేదని మరీ మరీ చెప్పాను.

శ్రీమతికి నన్నలా పిలుస్తూ బయట తిరగాలని వుందనుకుంటాను. నిజానికి ఆమె కింకా పట్టుమని పాతికేళ్ళు లేవు. పక్కన మా పిల్లలిద్దరూ లేకపోతే తనసలు పెళ్ళయిన మనిషిలా వుండదు. సన్నగా, తెల్లగా, అందంగా వుండే శ్రీమతిలోని కొత్త కోరికలను • యిప్పుడే చూస్తున్నాను నేను. మా పిల్లలు మా పిలుపుల గురించి పట్టించుకున్నట్లు లేదు. వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు.

మే మిద్దరం కలిసి బీచికి వెళ్ళాం; హోటల్‌కు వెళ్ళాం, సినిమాకు వెళ్ళాం; శ్రీమతి అన్నిచోట్లా కూడా నా చేతిలో చేయి కలిపి నడిచింది. భుజానికి భుజం రాస్తూ మాట్లాడింది. ఉండుండి అదే పనిగా నవ్వేది. చాలా వుత్సాహంగా, చలాకీగా వుండేది. అన్ని సమయాల్లోనూ నన్ను నువ్వు అని పిలిచేది. ఆమె అలా పిలవగానే చుట్టూ వున్న వారంతా నాకేసి చూసినట్లూ, నన్నుచూసి నవ్వుతున్నట్లూ అనుభూతి పొందాను. కానీ ఆ అనుభూతితో పాటే సినిమా హీరోయిన్లకు తీసిపోని అందమైన యువతి నాకు భార్యగా వున్నదన్న భావన కూడా నాకు ప్రప్రథమంగా కలిగింది.

ఇదివరలో శ్రీమతి చాలా ముక్తసరిగా వుండేది. నాకు కాస్త దూరంగా వుండేది. రోడ్డుమీద నడుస్తున్నప్పుడు చేయి పట్టుకోవడం మాట అటుంచి ఒకరి వేలు ఒకరికి తగిలినా సిగ్గుపడేది. పైగా మీకు "సిగ్గులేదు" అని కూడా అనేది. అటువంటి మనిషికి యీ విపరీతమయిన ప్రవర్తన యెంతవరకూ నప్పిందీ అని ఆలోచిస్తున్నాను నేను. అలా ఆలోచించడంలోనే ఆమె అందం యితరుల నాకర్షించేటంత గొప్పదని గుర్తించి ఆ చేత్తోనే నా అదృష్టాన్ని కూడా గుర్తించాను.

శ్రీమతి యిలా మారిపోవడానికి నా తలిదండ్రు లూళ్ళోలేకపోవడమని నే ననుకోను. వాళ్ళు లేనప్పుడు కూడా మే మిద్దరం బీచికీ, సినిమాలకూ వెళ్ళాం. అప్పు డామె యిప్పటిలా ప్రవర్తించేది కాదు. ఆమెపైన రామనాథం భార్య సరళ ప్రభావం చాలా ఉన్నదని నాకు అనిపించింది.

సినిమా చూసి యింటికి వచ్చేక "ఈ రోజు నువ్వు నాకు చాలా నచ్చేవు. ఎప్పుడూ యిలాగేవుంటే నాకు సంతోషంగా వుంటుంది" అన్నాను. ఈసారి నే నన్నమాటల్లో కనీసం యాభై శాతమయినా మనస్ఫూర్తిగా వచ్చి వుంటాయి.

"వయసు మళ్ళీ మళ్ళీ వచ్చేది కాదు. సరదాలను అణచుకోకూడదనీ, చలాకీగా ఉత్సాహంగా వుండాలనీ సరళ అంటుంది రంగా!" అంది శ్రీమతి.


నే ననుకున్నట్లుగానే యిదంతా సరళ ప్రభావమే. క్రమంగా నేను శ్రీమతి కొత్త పిలుపుకు అలవాటుపడుతున్నాను. అలవాటుపడుతున్నకొద్దీ ఆ పిలుపు నా కంత ఎబ్బెట్టుగా అనిపించడం లేదు.

రోజులు నెమ్మదిగా గడుస్తున్నాయి. నాన్నగారు రావడం కాస్త ఆలస్యమే అయింది. వచ్చేముం దాయన ఉత్తరం రాశారు. వాళ్ళు రేపు వస్తారనగా నేను మళ్ళీ యెప్పటి రంగారావును అయిపోయాను.

"వాళ్ళెదురుగా కూడా నువ్వు నన్ను నువ్వనే పిలుస్తావా?" అన్నాను. అమ్మా, నాన్న, యిద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ముడు - వీళ్ళముందు దీన్ని యెలా తట్టుకోవాలా అని నా బెంగ!

"పిలవాలనే వుంది రంగా! కానీ నీ కిష్టం






లేకపోతే నా కోరిక తీరదు" అంది శ్రీమతి.

"నా కిష్టమేనని చెప్పానుగా!" అన్నాను.

"నీకు నిజంగా యిష్టమే అయిన పక్షంలో నువ్వే వాళ్ళకు నచ్చజెప్పాలి. నీ బలవంతం మీదనే నే నలా పిలుస్తున్నట్లు చెప్పాలి. నేను యిష్టపడ్డంలేదనీ, ప్రతిఘటిస్తున్నాననీ-అయినా సరే నువ్వు శాసించడంవల్ల అలా చేస్తున్నాననీ చెప్పాలి. లేకపోతే నామీద ఒట్టే!" అంది శ్రీమతి.

ఇది నాకు చాలా యిబ్బంది కలిగించే విషయం. శ్రీమతికి మా అమ్మదగ్గర కానీ, నాన్నదగ్గర కానీ యిటువంటి విషయాలు మాట్లాడేటంత చనువు లేదు. అదీకాక తనే ఒకసారి భర్తను నువ్వు అని పిలిచేవారి గురించి మా అమ్మ దగ్గర వేళాకోళం చేసి వున్నది. సరళ వచ్చేక తను మారిపోయింది.

అమ్మా నాన్నలను రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కు వెడుతున్నానన్నమాటే కానీ నాకు స్థిమితం లేదు. నాన్నగారిది అదోరకం మనస్తత్వం. ఒకోసారి చాలా చిన్న విషయానికి ఆయన పెద్ద రగడ చేస్తారు. ఆయన మూడ్ బాగుండకపోతే శ్రీమతి కొత్త పిలుపే నాకొక సమస్య కాగలదు. ఆయనకు కోడలంటే చాలా అభిమానం. మనసెరిగి మసలుకునే మనిషి అని పొగుడుతూంటారు. ఈ ఆరేళ్ళలోనూ ఒక్కసారికూడా శ్రీమతి ఆయన్ను నొప్పించే పని చేయలేదు. అందుకే యీ కొత్త పిలుపు బాధ్యత నాపైకి నెట్టి తను తెలివిగా తప్పించుకుంది శ్రీమతి. పురుషుడికి అహంకారముంటే వుండవచ్చు గాక - కానీ యిలాంటి విషయాల్లో ఆడవాళ్ళు మగవాళ్ళని తేలికగా బోలాకొట్టించగలరు.

నేను స్టేషన్‌కి వెళ్ళాను. అంతా కలిసి ఒక టాక్సీలో యిల్లు చేరాం. ఇంటికి రాగానే శ్రీమతి నన్ను చూసి "మీ కోసం ఆఫీసు ప్యూను వచ్చాడండీ. మీ ఆఫీసరుగారు అర్జంటుగా మిమ్మల్ని రమ్మన్నారట" అంది.

నే నాశ్చర్యపోయాను. శ్రీమతి నన్నలా సంబోధిస్తుందని నే ననుకోలేదు. తేలికపడ్డ మనసుతో ఆఫీసుకు వెళ్ళి ఆఫీసరుగారి సందేహం తీర్చి వచ్చాను. తిరిగి వచ్చేకకూడా శ్రీమతి నన్ను పొరపాటున కూడా నువ్వు అనలేదు. ఇలా యెందుకు జరిగింది? ఆమె అత్త మామలకు భయపడుతోందా?

శ్రీమతి నాతో చెప్పిన ప్రకారం అత్త మామల యెదురుగా కనీసం కొంతకాలంపాటు

## డబ్బు

డబ్బు
నక్షత్రాలని కూడా కొంటుంది,
డబ్బు
సూపర్ ఎక్స్‌ప్రెస్ రైలుకి
రూపాయి బిళ్ళని అడ్డువేసి నిలిపివేస్తుంది
డబ్బు
దేశం తలమీద ఎగిరే
జెండాల రంగుని మార్చివేస్తుంది
డబ్బు
విమానాలని కూలుస్తుంది,
ప్రాణసుమాలను
బాణవర్షమై నేల రాలుస్తుంది,
డబ్బు
కవిత్వం పలుకుతుంది
ఊపిరి వెతుక్కుంటూ నడిచే
జీవితపు సుతిమెత్తని అరికాలికి
పలుకురాయై గుచ్చుకుంటుంది-
డబ్బు
డబ్బుని ప్రసవిస్తుంది
ఖాళీ కడుపుకి గాయంచేసి
అది
యురేనియమ్‌ని ప్రసవిస్తుంది!

—దేవీప్రియ

నన్ను నువ్వు అని పిలవకుండా పొడిపొడిగా పిలుస్తానంది. ఆ లెక్కన ఆమె "ఆఫీసులో అర్జంటువని వుందట ప్యూను వచ్చి చెప్పాడు" అని నాకు చెప్పవచ్చు. అలా అనకుండా "ఏమండీ!" అన్నదంటే అందులో యేదో పరమార్థమున్నది. అది తెలుసుకోవడం కోసం నేను రాత్రినుంచి యెదురుచూస్తున్నాను. అయితే ప్రయాణపు విశేషాలతో నాన్నగా రా రాత్రి పదకొండు దాటించారు. నా మనసులోని కుతూహలం కారణంగా నేను ఆ విశేషాలను విని ఆనందించలేకపోయాను.

రాత్రి అవకాశం రాగానే శ్రీమతిని అడిగేశాను.

"మీరు వెళ్ళేక ఆ సరళ వచ్చిందండీ - ఆవిడ కొత్తరకం నెక్లెస్ చేయించుకుంది. బాగుందని మెచ్చుకుని యెక్కడ చేయించిందో అడిగాను. తర్వాత నా నెక్లెస్ చూపించి యిలాంటిది మీకు బాగా నప్పుతుంది - చేయించుకోకూడదూ అన్నాను. ఆవిడ కెంత గర్వం అనుకున్నారు? తనను అందరూ అనుసరిస్తారుట. తనకు ఒకళ్ళని అనుసరించడం యిష్టముండదట - తనను యెవరెవరు ఏ యే విధంగా అనుకరించారో మెరిసేకళ్ళతో ఆవిడ చెబుతూంటే నాకు అనిపించింది. అనుకరించ డానికి ఆవిడలో విశేషమేముంది? అసలు ఆడ దానికి భర్తను మన్నించడంలోనూ, విచ్చల విడిగా వుండకుండా వుండడంలోనూ మాత్రమే అందం వుంది. నే నేదో పొరపాటుపడి ఆవిణ్ణి అనుకరించపోతే నా కంటే పెద్దవాళ్ళు కదా - మీరైనా నన్ను కాస్త హెచ్చరించవద్దూ - ఒకళ్ళను నువ్వు అనుకరించడ మేమిటి? నీ పద్ధతులే నాకు నచ్చుతాయి అని మీరు నాకు చెప్పవద్దూ. మీ మూలంగానే నే నావిణ్ణి అనుకరించాను. ఇంకా నయం నేను మిమ్మల్ని నువ్వని పిలుస్తున్నట్లు ఆవిడకు చెప్పలేదు. చెపితే యింకా విర్రవీగిపోయేది" అంది శ్రీమతి.

శ్రీమతి నన్ను తప్పుపట్టింది. అయినా నాకు బాధ కలగలేదు. నా సమస్య ఒకటి తీరిపోయింది. ఇతరులను అనుకరించకపోవడం సరళ ప్రత్యేకత. అదే ప్రత్యేకతను సరళ చెప్పాకనే తనూ అలవర్చుకోవాలనుకుంటోంది శ్రీమతి. ఒకవిధంగా ఇదికూడా అనుకరణే! ఈ విషయాన్ని శ్రీమతికి వివరించి చెప్పి కొత్త సమస్యలను సృష్టించుకునే ఉద్దేశ్యంనాకు లేదు.

ఆడది పురుషుడి అహంకారాన్నెంతయినా సహించగలదు. అతడికి బానిసగా పడివుండ గలదు. కానీ మరో ఆడదాని అభిజాత్యాన్ని ఈషణ్మాత్రం సహించలేదు. ఇది కొనసాగి నంతకాలమూ - ఇది పురుష ప్రపంచంగానే వుండిపోతుంది. తప్పదు!

నేనూ పురుషుణ్ణే కాబట్టి ఈ విషయమై బాధ లేకపోయినా నా శ్రీమతిపట్ల జాలి మాత్రం నా కున్నది! □

